క్లుప్తంగా

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



బిక్కవోలులో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించిన ట్రస్ట్ వైస్ చైర్మన్ లక్ష్మణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద 8వ తరగతి విద్యార్థులకు అర్తమూరుకు చెందిన ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను ట్రస్ట్ వైస్ చైర్మన్ లక్ష్మణరెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకరరావు మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ట్రస్ట్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్తిరెడ్డి, జంగా శ్రీనివాస్‌ప్రసాద్, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధి వినాయకుడికి గరిక పూజ



ప్రత్యేక అలంకరణలో సిద్ధి వినాయకుడు

పెదపూడి: మండలంలోని సంపర సిద్ధి వినాయకుడికి ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు బుధవారం గరిక పూజ, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

రేపు చంద్రశేఖర స్వామికి అభిషేకాలు

రంగంపేట: మండల పరిధిలోని చండ్రేడు గ్రామంలో కొలువైయున్న కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో శుక్రవారం మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ తెలిపారు. భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకోవాలని ఆయన కోరారు.

పుష్కర కాలువలో ఉపాధి పనులు



మర్రిపూడి పుష్కర కాలువను శుభ్రం చేస్తున్న ఉపాధి కూలీలు

రంగంపేట: మండల పరిధిలోని మర్రిపూడి పుష్కర సాగునీటి కాలువ అభివృద్ధి పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ గ్రామానికి గండేపల్లి మండలంలోని ఎర్రంపాలెం పుష్కర ఉప ఎత్తిపోతల పథకం ద్వారా 500 ఎకరాలకు నీరు అందవలసి ఉంది. సాంకేతిక కారణాల వల్ల గతేడాది గ్రామానికి నీరు అందలేదు. ప్రస్తుతం అధికారులు సాగునీటి వనరులపై దృష్టి పెట్టడంతో ఈ ఏడాది మరో పది రోజుల్లో నీరందే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో కాలువలో ఉన్న తూడు, పిచ్చి మొక్కలు, చిన్న చిన్న ఇసుక మేటలను ఉపాధి కూలీలు తొలగిస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

బిక్కవోలు: మండలంలోని రంగాపురం, బలభద్రపురం సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ బుధవారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మండలంలోని రంగాపురం, నల్లమిల్లి, మర్రిపూడి, బలభద్రపురం, గంగులూరిపాక, కాపవరం గ్రామాల్లో విద్యుత్ నిలిచిపోతుందన్నారు.

సీతానగరం: పురుషోత్తపట్నం సబ్‌స్టేషన్ మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లకు సరఫరా నిలిపివేస్తామన్నారు. దీంతో పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, పెదకొండేపూడి, అచ్చయ్యపాలెం, చీపురుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే సత్యసాయి డ్రింకింగ్ ప్రాజెక్టు, తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్‌లకు, వ్యవసాయ మోటార్లు, ఇండస్ట్రియల్ ఫీడర్‌కు అంతరాయం కలుగుతుందన్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే మూలారెడ్డి విగ్రహావిష్కరణ

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం ఆవిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన విగ్రహావిష్కరణ ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమానికి వివిధ శాఖల మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి, మాజీ ఎంపీటీసీలు సబ్బారపు సూర్యనారాయణ, సబ్బెళ్ల విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమను కాపాడి

- మహిళాభ్యున్నతికి డెయిరీ సహకార సంఘాల బాటలు
- పాడి పరిశ్రమలో కీలకంగా మారుతున్న అతివలు
- బాసటగా జంభూపట్నం డెయిరీ కేంద్రం



జంభూపట్నంలోని పాలవెల్లువ కేంద్రం వద్ద పాలను సేకరిస్తున్న ట్యాంకర్

మధురపూడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పాలవెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘాలు పల్లెల్లోని మహిళల ఆర్థికాభ్యున్నతికి బాటలు వేస్తున్నాయి. డెయిరీలు కోకొల్లలుగా ఉన్నప్పటికీ, పాడి రైతులకు అక్కరకు రాకపోవడంతో, వీటి ఏర్పాటు అనివార్యమైంది. గత ప్రభుత్వం బృహత్తర కార్యాచరణలో భాగంగా నెలకొల్పిన ఈ కేంద్రాలు సమర్థంగా పనిచేస్తూ, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. కోరుకొండ, సీతానగరం రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్ మండలాలకు సంబంధించి కోరుకొండ మండలం జంభూపట్నంలో ఈ డెయిరీ నిర్వహిస్తున్నారు. ఆయా మండలాల్లోని 38 గ్రామాలకు చెందిన పాడి రైతుల నుంచి నిత్యం పాల సేకరణ చేసి, జంభూపట్నం డెయిరీ కేంద్రానికి చేరవేస్తారు. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో 19,565 ఆవులు, 44,076 పాడి గేదెలున్నాయి. వీటి ద్వారా నిత్యం పాల ఉత్పత్తి జరుగుతోంది.

ఆదాయ వనరు

పాల వెల్లువ కేంద్రాలు పాడి రైతులకు ఆదాయ వనరులుగా నిలిచాయి. ప్రధానంగా మహిళా సహకార సంఘాల ద్వారా పాల సేకరణ జరుగుతోంది. ఈ కేంద్రాల ద్వారా గేదె పాలు లీటరు రూ.104, ఆవుపాలకు గరిష్ఠంగా రూ.40 రైతులు పొందుతున్నారు. ఈ పాలు 10 ఫ్యాట్, 12 ఫ్యాట్, 14 ఫ్యాట్‌గా ఉంటుంది. ఈ మేరకు గేదె పాలు లీటరు కనీస ధర రూ.82 నుంచి గరిష్ఠంగా రూ.104 వరకు ఉంది. అలాగే ఆవు పాల రూ.35 నుంచి రూ.40 వరకుంటుంది. సాధారణంగా జంభూపట్నం కేంద్రానికి రోజుకు రెండు వేల లీటర్ల పాలు వచ్చేది. ప్రస్తుతం అన్ సీజన్ కావడంతో సుమారు 1,400 లీటర్లు మాత్రమే సేకరిస్తున్నారు.

నిర్వహణ ఇలా..

కోరుకొండ మండలం జంభూపట్నంలోని పాల వెల్లువ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య కేంద్రానికి పాడి రైతుల నుంచి పాలు సరఫరా అవుతాయి. రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాల నుంచి సేకరించిన పాలను ఆటోల్లో ఇక్కడికి తరలిస్తారు. ఆ పాలను జంభూపట్నంలో పాల శీతలీకరణ ద్వారా నిల్వ చేస్తారు. ఈ పాలను పశ్చిమ గోదావరి జిల్లా జి.కొత్తపల్లిలో ఉన్న ప్రధాన కేంద్రానికి ట్యాంకర్ల ద్వారా తరలిస్తారు. అక్కడ పాలు, పాల ఉత్పత్తి పదార్థాలను తయారుచేసి, మార్కెటింగ్ చేస్తారు.

నాణ్యత కలిగిన పాలు



మహిళలను పాడి రైతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పాలవెల్లువ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య కేంద్రాలను ప్రభుత్వం నెలకొల్పింది. రైతాంగం కోసం వీటిని నిర్వహిస్తున్నారు. నాణ్యత కలిగిన పాలను సమాజానికి అందించడం చాలా ముఖ్యం, నాణ్యమైన పాలు అందించడానికి ఈ కేంద్రాలు దోహదపడుతున్నాయి.

– ప్రభావతి, ఏడీ, పశు సంవర్థక శాఖ, కోరుకొండ

మహిళాభ్యున్నతి కోసం..



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం పాలసేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో పాల ధర ఆమోదయోగ్యంగా, లాభదాయకంగా ఉంది. పాడి అభివృద్ధికి కీలకమైన పాత్రను మహిళలు పోషించడంతో, వారికి ప్రత్యేకమైన గుర్తింపు లభించింది.

– అల్లి సింహాచలం, బొల్లెద్దుపాలెం, పాడి రైతు

8న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

పెదపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు ఆగస్టు 8న నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి–2 సీవీవీ సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన పెదపూడిలో మాట్లాడుతూ 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ ఎన్నికల ప్రక్రియ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ్యుల ప్రమాణ స్వీకారం, 3 గంటలకు మొదటి ఎస్ఎంసీ సమావేశం నిర్వహిస్తారన్నారు. ఎన్నికలకు సంబంధించి ఆగస్టు 1న నోటీస్ బోర్డులో ఓటరు జాబితా ప్రదర్శన, 5న ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ ఉంటాయన్నారు. ఎన్నికల అధికారిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వ్యవహరిస్తారన్నారు.

సారా కేసులో వ్యక్తికి రిమాండ్

సీతానగరం: మండలంలోని రాపాకకు చెందిన కోమలి శంకరం అనే వ్యక్తికి సారా కేసులో కోర్టు రిమాండ్‌కు ఆదేశించిందని ఎస్సై టి.రామకృష్ణ బుధవారం తెలిపారు. రాపాక గ్రామానికి శివారున సారా అమ్ముతుండగా, పోలీసులు దాడి చేసి అతడిని అరెస్టు చేశారు. అతడి వద్ద 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

పుస్తకాల పంపిణీ

మధురపూడి: నేటి విద్యార్థులే రేపటి సమాజాభివృద్ధికి కారకులని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. కోరుకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు బుధవారం పాఠ్య, నోట్ పుస్తకాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ, కాలేజీ ప్రిన్సిపాల్ ఐ.శారద మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు చదువు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరోజ, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీసు అధికారులకు సత్కారం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఆరుగురు అధికారులను జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం సన్మానించారు.పదవీ విరమణ చేసిన ఎస్సైలు ఎండీ ఉస్మాన్, వి.రాజకుమార్, ఎస్.సత్యనారాయణ, ఉమెన్ ఏఎస్సై జీఆర్.శాంతిదేవి, ఏఎస్సైలు డి.కోటేశ్వరరావు, ఏ.శ్రీనివాసరావులను జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.చెంచిరెడ్డి, పోలీస్ అధికారుల సంఘం ప్రెసిడెంట్ ఆర్.రఘురాం, ఇతర సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఏటీఎల్ లక్ష్యాలను సాధించాలి

డీఈఓ కె.వాసుదేవరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వాసుదేవరావు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నీతి అయోగ్ పరిధిలోని అటల్ ఇన్నోవేషన్ మిషన్‌కు సంబంధించి దేశంలోని పాఠశాలల్లో స్థాపించిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల లక్ష్యాలను సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఈఓ కె.వాసుదేవరావు అన్నారు. స్థానిక ట్రైనింగ్ కళాశాలలో బుధవారం జిల్లాలోని ఏటీఎల్ ల్యాబ్‌లున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ దేశంలో ఒక మిలియన్ మంది పిల్లలను నియోటెరిక్ ఇన్నోవేటర్లుగా తీర్చిదిద్దేందుకు, యువకుల్లో ఉత్సుకత, సృజనాత్మకత, ఊహాశక్తిని పెంపొందించడం, డిజైన్ మైండ్‌సెట్, కంప్యూటేషనల్ థింకింగ్, అడాప్టివ్ లెర్నింగ్, ఫిజికల్ కంప్యూటింగ్ తదితర నైపుణ్యాలను పెంపొందించడం ఈ పథకం లక్ష్యమని వివరించారు. జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీ ఎస్.సుభాషిణి మాట్లాడుతూ ఏటీఎల్ అనేది అటల్ ఇన్నోవేషన్ మిషన్ పేరుతో గొడుగు మిషన్ కింద నిర్వహించే ప్రాజెక్టు అన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా జిల్లా ఏఎంఓ గౌరీశంకర్, సీఎంఓ శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి నెహ్రూ, ఏటీఎల్ ఇన్‌చార్జి బీవీఎల్ఎన్ ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

వేగుళ్లమ్మ అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు

సీతానగరం: ఆషాఢ మాసం సందర్భంగా మిర్తిపాడు గ్రామ దేవత వేగుళ్లమ్మ అమ్మవారికి మహిళలు సారెను సమర్పించారు. బుధవారం ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సహకారంతో మహిళలు 101 రకాల పిండి వంటలతో కూడిన సారెను సమర్పించారు.

దర్బార్ లోపల.. సమస్యలు వెలుపల



ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా దర్బార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీడీఓ తదితరులు



కార్యాలయ భవనం బయట టెంట్‌లో కూర్చున్న ప్రజలు

ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా దర్బార్ తీరు

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. అయితే నిర్వాహకులంతా కార్యాలయ భవనంలోని ఎంపీపీ చాంబర్‌కు పరిమితమయ్యారు. సమస్యల విన్నపానికి ఎంతో ఆశతో వచ్చిన వారంతా బయట టెంట్‌లో ఉండిపోయారు. సమస్యలు చెప్పే వారంతా బయట ఉంటే, వాటిని ఓ కొలిక్కి తేవాల్సిన ప్రజాప్రతినిధులు మాత్రం లోపలుండటం అందర్నీ విస్మయపరిచింది. సమస్యలను పరిష్కరించడానికి నిర్వహించిన ప్రజాదర్బార్‌ను కార్యాలయానికి పరిమితం చేయడంతో, రాజకీయ నాయకుల సమస్యలు మినహా, మిగతా విషయాలు ఎమ్మెల్యేతో పాటు, ఎంపీడీఓ హేమసుందరరావు, ఇతర అధికారుల దృష్టికి వెళ్లలేదు. ఇలాఉండగా, సమస్యల పరిష్కారంతో పాటు, సంక్షేమ పథకాలకు వినతిపత్రాలు ఇవ్వాలని వచ్చిన వారికి ప్రజాప్రతినిధుల దరి చేరే అవకాశం దొరకలేదని స్థానిక, ప్రజలు వాపోయారు.

ఇది యాపారం మరి..!

స్థానిక వ్యాపారుల వినూత్న ప్రచారం



దివాన్‌చెరువులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న స్థానిక వ్యాపారుల ఆటో

రాజానగరం: ఆధునిక సాంకేతిక ఒరవడితో ప్రతి రంగంలోను పోటీతత్వం పెరిగిపోతోంది. నిన్నటి వరకు పట్టణాలకే పరిమితమన్నట్టుగా ఉన్న మాల్స్ నేడు మండల కేంద్రాల్లోను తిష్ట వేస్తున్న తరుణంలో స్థానిక వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో తమ వ్యాపారాలను కాపాడుకుంటూ, వినియోగదారులకు మాల్స్ పేరుతో జరుగుతున్న దోపిడీపై అవగాహన కలిగించేలా దివాన్ చెరువులోని వ్యాపారులు నడుం బిగించారు. స్థానికంగా ఉన్న తమ వర్తక సంక్షేమ సంఘం ద్వారా ఆటోకు స్థానిక వ్యాపారులందరిదీ ఒకటే కులం, మన ఊరు–మన వ్యాపారం, స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించండి.. అంటూ రూపొందించిన బ్యానర్లు కట్టి, వినూత్న ప్రచారాన్ని చేపట్టారు. మాల్స్‌లో నాణ్యమైన సరకులు, నిర్ణీత ధరలకే లభిస్తున్నాయనే భ్రమలో వినియోగదారులు ఎలా నష్టపోతున్నారో వివరిస్తూ ఈ ప్రచారాన్ని సాగిస్తున్నారు. ముఖ్యమైన సామాన్లు కొనడానికి కిరాణా దుకాణానికి వెళ్తే, వాటినే కొంటారని, అదే షాపింగ్ మాల్‌కి వెళ్తే కనిపించిన ప్రతి వస్తువుపై మనస్సు పారేసుకుని, మనీ పర్స్ ఖాళీ చేసుకుంటున్నారంటూ స్థానిక వ్యాపారులు అవగాహన కల్పిస్తున్నారు.

'బంగారు వరలక్ష్మి' సందడి



బంగారు రూపును విజేతకు అందిస్తున్న శ్రీనివాస్

మధురపూడి: కోరుకొండ శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ మండపంలో బంగారు వరలక్ష్మి కానుక–11 లక్కీడ్రా కార్యక్రమం బుధవారం సందడిగా జరిగింది. విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు భారీగా పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ మహిళా భక్తుల్లో హైందవ చైతన్యాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానన్నారు. మొత్తం 1,980 మంది పేర్లు నమోదు చేసుకోగా, వీరిలో 40 మంది విజేతలుగా ఎంపికయ్యారు. వీరికి గ్రాము బంగారు రూపును అందజేశారు. సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ విధానాలను అవలంబించాలి

కడియం: రైతులు పంట సాగులో సేంద్రియ విధానాలను అవలంబించాలని ఆత్మ జిల్లా ఏడీ విజయ రామలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో సిబ్బందితో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై రైతులతో మాట్లాడారు. భూసారాన్ని అనుసరించి మాత్రమే ఎరువులు వినియోగించాలని రైతులను కోరారు.

పశువుల దాణా పంపిణీ

కడియం: వరద సహాయక చర్యల్లో భాగంగా మండలంలోని పొట్టిలంక, కడియపులంక, వేమగిరి లంక ప్రాంతాల రైతులకు పశు సంవర్ధక శాఖ ద్వారా ఎనిమిది టన్నుల పశువుల దాణాను బుధవారం పంపిణీ చేశారు. కడియపులంకలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, పలువురు నాయకులు, పశు సంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ జనరల్ బాడీ సమావేశం

ప్రకాశం నగర్: సీపీఐ జిల్లా జనరల్ బాడీ సమావేశం గురువారం స్థానిక తాడితోటలోని సంహిత ఫంక్షన్ హాలులో నిర్వహించనున్నట్టు పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల సుబ్బారావు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు హాజరవుతారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి రిలే దీక్షలు చేపడతాం

చర్చి పరిరక్షణ కమిటీ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ సభ్యులు

సీటీఆర్ఐ: నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్‌తో గురువారం నుంచి రిలే దీక్షలు చేపడుతున్నట్టు ధవళేశ్వరం ఎస్ఏంఈ లూథరన్స్‌చర్చి పరిరక్షణ కమిటీ సభ్యులు తెలిపారు. చర్చి ఎదురుగా దీక్షలు ప్రారంభిస్తున్నట్టు కమిటీ సభ్యులు ఎం.ప్రమోద్‌కుమార్ బుధవారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. ఏఈఎల్‌సీ మోడరేటర్ పరదేశి బాబు ఉత్తర్వుల కారణంగానే చర్చిలో నిధుల దుర్వినియోగం కావడానికి ఆస్కారం ఏర్పడిందని ఆరోపించారు. పాస్టర్ సరెళ్ల అనిల్‌కిరణ్, జక్కల ప్రవీణ్ చర్చి నిధులను, సభ్యులు ఇస్తున్న కానుకలను దారిమళ్లిస్తున్నారన్నారు. వారి లెక్కల ప్రకారం చర్చికి నెలకు రూ.3.50 లక్షల ఆదాయం వస్తోందని, దానిలో రూ.1.50 లక్షలు ఖర్చులు పోగా, మిగిలిన రూ.రెండు లక్షల చొప్పున ఇప్పటి వరకు సుమారు రూ.84 లక్షలు దుర్వినియోగం చేసినట్టు తేలిందన్నారు. సినడ్ ఉత్తర్వుల కాపీలతో పాటు, అన్ని వివరాలను కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశామని, ఆయన ఆదేశాలతో మైనార్టీ వెల్ఫేర్ అధికారులు విచారణ జరుపుతున్నారని తెలిపారు. ఏఈఎల్‌సీ నిబంధనల మేరకు మోడరేటర్ ఇచ్చిన ఉత్తర్వులు చెల్లవని, అడ్‌హాక్ కమిటీ ట్రెజరర్ నిధులు డ్రా చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇరు వర్గాలను శాంతింపజేయాల్సి ఉండగా, పరిరక్షణ కమిటీ సభ్యులను బెదిరించి ఓవర్ చేస్తున్నారని చెప్పారు. పాస్టర్ జి.కిరణ్‌బాబు విధులు నిర్వర్తించకుండా అడ్డుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో సభ్యులు దేవ ఏసేపు, తొర్లపాటి విజయవర్ధన్ రవీంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం పూడికలు తొలగించాలి

కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: వర్షాల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని కాలువల్లోని మురుగును, వ్యర్థాలను నిరంతరం తొలగిస్తూ, వర్షపు నీరు పారేలా అడ్డంకుల్లేకుండా చూడాలని కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నగరంలో పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో మాట్లాడి, ఆయా పనులపై వారికున్న అవగాహనను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులు అంకిత భావంతో పనిచేయాలని, అప్పుడే నగరంలో పారిశుధ్యం మెరుగు పడుతుందన్నారు. స్వచ్ఛ భారత్ పోటీలో మెరుగైన ర్యాంకు కోసం ఇప్పటి నుంచే అంకిత భావంతో పనిచేయాలన్నారు. వీధుల్లో చెత్తకుప్పలు లేకుండా చూడాలన్నారు.అనంతరం క్వారీ మార్కెట్ వద్ద డాగ్ సెంటరును సందర్శించి, రికార్డులను పరిశీలించారు. కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేయడానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ ఆరోగ్యాధికారి డా.ఎ.వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

ఎంఎస్ఆర్ సేవలు చిరస్మరణీయం



ఎంఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం నగరానికి మేడపాటి సీతారామరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఏపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంఎస్ఆర్ హైటెక్ బస్టాండ్ వద్ద ఆయన 23వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఆర్ విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. షర్మిలారెడ్డి మాట్లాడుతూ నగరంలో పలు ధార్మిక సంస్థలకు ఆయన సొంత ఖర్చుతో శాశ్వత భవనాలు కట్టించారని కొనియాడారు. టీటీడీ దేవస్థానంలో మేడపాటి సీతారామరెడ్డి కల్యాణ మండపం, కైలాసభూమి, క్వారీ మార్కెట్ వద్ద శివాలయం తదితర వాటిని ఆయన నిర్మించారన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్ కుమారుడు మేడపాటి అనిల్‌రెడ్డి, ఎంఎస్ఆర్ ఫాలోవర్స్, హైటెక్ ఆటోస్టాండ్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి తరానికి మార్గదర్శకుడు సుబ్బారావు



సుబ్బారావు దంపతులను సత్కరిస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: అగ్ని ప్రమాదాల సమయంలో సీనియర్ లీడింగ్ ఫైర్‌మన్‌గా విధి నిర్వహణలో జవ్వాది సుబ్బారావు చేసిన సేవలు అద్వితీయమని జిల్లా సహాయ అగ్నిమాపకాధికారి పి.శ్రీనివాసరావు అన్నారు. ఇన్నీసుపేట ఫైర్ స్టేషన్‌లో 31 ఏళ్ల పాటు నిర్విరామంగా సేవలందించిన సుబ్బారావు పదవీ విరమణ అభినందన సభ బుధవారం స్థానిక దానవాయిపేట 3స్టార్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ముఖ్యఅతిథి శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్నిమాపక దళంలో ప్రమాద సమయంలో సుబ్బారావు అందించిన విశేష సేవలు నేటి తరం ఉద్యోగులు మార్గదర్శకంగా తీసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాల సమయాల్లో సుబ్బారావు చేసిన సాహసాలకు విశిష్ట సేవా పతకాలు, కలెక్టర్ ప్రశంసలు పొందారన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ రాజమహేంద్రవరం వేమన రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్రి వెంకట రామారెడ్డి, అనపర్తి ఫైర్ ఆఫీసర్ జీరి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరు ఫైర్ ఆఫీసర్ వేణు, రామచంద్రపురం ఫైర్ ఆఫీసర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.